క్లుప్తంగా

దివ్యాంగులకు నగదు పంపిణీ



భట్టిప్రోలు: ఎన్నికల నియమావళి అమలులో ఉండటంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ నెలకు సంబంధించి సామాజిక భద్రతా పింఛన్లు నగదు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో శనివారం జమ అయింది. భట్టిప్రోలు మండలంలో 8,659 పింఛన్‌దారులు ఉండగా మంచానికి పరిమితమై, నడవలేని వారు, దివ్యాంగులు మొత్తం 2,336 మందికి గాను సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి సాయంత్రానికి 1,793 మందికి నగదు పంపిణీ చేశారు. ఆదివారం బ్యాంకుకు సెలవు కావడంతో పింఛన్‌దారులు సోమవారం దాకా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

మలేరియా నివారణ మాసోత్సవాలు



భట్టిప్రోలు: మలేరియా నివారణ మాసోత్సవాలు పురస్కరించుకుని భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యులు ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నిల్వ నీటి ప్రదేశాలను అరికట్టి మలేరియా నిర్మూలనకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. జ్వరం వచ్చినట్లయితే వెంటనే మలేరియా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని కోరారు.

అమృతలూరు భవిత కేంద్రాల్లో సర్వే



అమృతలూరు(వేమూరు): భవిత కేంద్రాల్లో విద్యార్థులకు ప్రత్యేక అవసరాల పరికరాలు అందజేసేందుకు ఐఈ ఆర్పీలు ద్వారా సర్వే చేయించడం జరుగుతుందని ఎంఈఓ- 2 కనపాల రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. అంగన్ వాడీ కేంద్రంలో దివ్యాంగులు విద్యార్థులు ఉన్నట్లయితే పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగులకు భవిత కేంద్రా ద్వారా అనేక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రిసోర్సు పర్సన్ సర్వే చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ పి.రాజు పాల్గొన్నారు.

దుకాణం కూల్చివేతపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: దుకాణం కూల్చివేతపై నల్లపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాలు.. గోరంట్ల గ్రామానికి చెందిన మరియమ్మ హోసన్న మందిర్ సమీపంలో రోడ్డు పక్కన శ్రీకనకదుర్గ అమ్మవారి అనుగ్రహంతో అమ్మవారి ఫొటోలతో చిన్న ఆలయాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తూ ఉండేది. ఈ క్రమంలో పదేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా ఆలయాన్ని కూల్చి వేయాల్సి రావటంతో ఆలయం వెనుకే ఉన్న ప్రైవేటు స్థలంలో చిన్న బంకును ఏర్పాటు చేసి అందులో అమ్మవారి ఫొటోలను ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తుండేది. ప్రైవేటు స్థలంలో అమ్మవారి ఫొటోలతో ఆలయ ఏర్పాటుపై గతంలో వివాదం కాగా కోర్టులో కేసు నడుస్తుంది. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు అమ్మవారి ఫొటోలతో పూజలందుకుంటున్న కొట్టును కూల్చివేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వాహనాల దగ్ధం



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు గతంలో ఎప్పటి నుంచో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపిన వాహనాలు శనివారం ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యాయి. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ స్పందిస్తూ పోలీస్ స్టేషన్ సమీపంలోని ముళ్లపొదలు, చెత్త చెదారం నిప్పు పెడుతుండడంతో వాహనాలు దగ్ధమైనట్లు భావిస్తున్నట్లు చెప్పారు. వెంటనే స్పందించి తాము ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా మంటలను ఆర్పివేశారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు

పదమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పదమటిపాలెంలో కొలువైన 33 అడుగుల శ్రీ సుందరాంజనేయ స్వామికి హనుమత్ జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పదమటి సుందర కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హాజరై పూజలు చేశారు. వేమవరంలోని రుక్మాబాయి సహిత పాండురంగస్వామి దేవాలయంలో కొలువైనసువర్చలా సమేత అభయాంజనేయ స్వామి, దాసాంజనేయ స్వామి వార్లకు అర్చకులు ధారా నారాయణ మూర్తి పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో కొలువైన అభయాంజనేయస్వామిని ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొలువైన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఆకుపూజలు, ప్రత్యేక పూజలు, స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామికి వెంకటేశ్వర భజన సమాజం ఆధ్వర్యంలో ఆకుపూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. కార్యక్రమాన్ని ఆత్మూరి మురళి పర్యవేక్షించారు. అలాగే అభయాంజనేయ స్వామికి ఆకుపూజ, కల్యాణోత్సవం జరిగింది. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు. పల్లెకోనలో దాసాంజనేయ స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలను పడమటి యానాది పర్యవేక్షించారు. మండలంలోని రాచూరులో కొలువైన సువర్చలా సమేత ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వెల్లటూరులో చెన్నకేశవస్వామి దేవాలయంలో కొలువైన వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. శ్రీ కట్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో కొలువైన శ్రీ ఆంజనేయస్వామి వారికి పూజలు నిర్వహించారు. ఐలవరంలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి సామూహిక హారతులు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథచక్రవర్తి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఏకాహం శనివారం ఉదయం ముగిసింది.

ఈదుపల్లిలో..

నగరం: నగరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో లక్షమల్లెలతో అర్చన, తమలపాకుల పూజా కార్యక్రమాలను కనుల పండువగా జరిపించారు. మండలంలోని ఈదుపల్లి, మీసాలవారిపాలెం, ఉక్కావారిపాలెం,గూడపాటివారిపాలెం గ్రామాలలోని అభయాంజనేయ స్వామి ఆలయాలలో విశేష పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

కొల్లూరు మండలంలో..

కొల్లూరు: హనుమత్ జయంతి వేడుకలు కొల్లూరు మండలంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. కొల్లూరు గొడపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చిన హనుమంతుణి దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అనంతవరం, పోతార్లంక, క్రాప అడ్డరోడ్డు, చినపులివర్రు తదితర గ్రామాలలో హనమత్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి.

వేమూరు మండలంలో..

వేమూరు(జంపని): మండలంలోని జంపని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతిని వైభవంగా నిర్వహించారు. డి.లక్ష్మీనరసింహచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. సువర్చలా సహిత వీరాంజనేయ స్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. 108 మందితో 1108 నామాలను పఠింప చేసి లక్ష నామ యజ్ఞ క్రతువును నిర్వహించారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని శీలంవారిపాలెం గ్రామ శివారులోని ఆంజనేయస్వామి విగ్రహానికి, చింతాయపాలెం గ్రామంలోని అభయాంజనేయస్వామి, నడుంపాలెంలోని ఏకశిల ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి, పెదపులుగువారిపాలెం, పెదగొల్లపాలెంలోని పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు. కర్లపాలెం అగ్రహారం, దమ్మనవారిపాలెం, యాజలి, ఏట్రవారిపాలెం,ఎంవిరాజుపాలెం, బుద్దాం, గ్రామాలలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో గత 40రోజులుగా భక్తులు హనుమాన్ చాలీసా పూజలు చేస్తున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ చేశారు.



రేపల్లెలో వీరాంజనేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కప్పలవారిపాలెంలో ఎమ్మెల్యే పూజలు

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు గ్రామాలలో హనుమజ్జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఖాజీపాలెం శివారు కప్పలవారిపాలెంలోని హనుమంతుని విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని క్షీరాభిషేకం చేశారు. అలకాపురం శివారు సత్యనారాయణపురంలో స్వామి విగ్రహాల వద్ద హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం శివారు కొత్తపేటలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద దేగల రవిరెడ్డి దంపతులు గ్రామస్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.



కప్పలవారిపాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోన



హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేపల్లె ప్రాంతంలో..

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణం రైలుపేటలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సింధూరం, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. తమలపాకులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో హనుమత్ వ్రతం చేశారు. రేపల్లె మండలంలోని పేటేరులో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పూడి రోడ్డులోని శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు చేశారు. బొందలగరువులో భారీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామ పరిసర ప్రాంతాలలోని భక్తులతో కిటకిటలాడింది. స్వామి వద్ద ప్రత్యేక దీపారాధనలు చేసి పూజా కార్యక్రమాలు చేశారు. రేపల్లె పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో, కోదండ రామ స్వామి ఆలయంలో, ఓల్డ్‌టౌన్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో, సింగుపాలెం, నల్లూరుపాలెం, కై తేపల్లి, తుమ్మల, కారుమూరు, తదితర గ్రామాలలోని ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.



పడమటిపాలెంలో కొలువైన 33 అడుగుల శ్రీసుందరాంజనేయస్వామి వారి విగ్రహం



కొల్లూరు గొడపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి విగ్రహం



గాజులపేటలో స్వామి వారిని దర్శించుకున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు

బాపట్లలో కల్యాణోత్సవం...

బాపట్ల: బాపట్ల పట్టణంలోని హనుమజ్జయంతి ఉత్సవాలు అంత్యంత వైభవంగా శనివారం జరిగాయి. శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సింధూరర్చన, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం ఉష్ట వాహన సేవ (ఒంటె) భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనంతవరంలో తెనాలి ఎమ్మెల్యే పూజలు



కొల్లూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అనంతవరం వీరాంజనేయస్వామి ఆలయంలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన పూజా మహోత్సవాలలో పాల్గొన్న ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజామద్దతు, దైవానుగ్రహంతో తిరిగి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రానున్నదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు తిరిగి వైఎస్సార్ సీపీకి అధికారాన్ని కట్టబెట్టనున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డి.రాంబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



జంపని(వేమూరు): మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఎంఈఓ- 2 రోజ్‌ల్యాండ్ మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు కొన్ని సూచనలు అందించారు. విద్యార్థులకు నాణ్యతమైన భోజన అందించిన నిర్వాహకులకు ప్రభుత్వం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు. నిర్వాహకులందరు ప్రభుత్వం నిబంధనలకు తప్ప కుండా పాటించాలని సూచించారు. పాటించక పోతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమవరంలో ఘటం ఊరేగింపు

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామ దేవత పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారి ఘటం ఊరేగింపు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చి ఇంటింటికి ఇలవేల్పువై ముగ్గురమ్మల మూలపుటమ్మ వైన పోలేరమ్మ అమ్మవారి మహోత్సవాలలో చివరి రోజు ఆదివారం భక్తులు వేడి నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించుకోనున్నట్లు గ్రామ కమిటీ, యువజన సంఘం తెలిపింది. భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే శిక్ష తప్పదు

కార్మికశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్

బాపట్ల టౌన్: బాల కార్మికులతో పనులు చేయిస్తే జైలు శిక్ష తప్పదని కార్మికశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా శనివారం పట్టణంలోని కార్మిక చట్టాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, కార్మికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తొలుత హోటల్స్, బేకరీలు, మెకానిక్ షాపుల్లో తనిఖీ చేశారు. షాపు యజమానులకు బాలకార్మిక వ్యవస్థ, చట్టాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల వయసులోగా బాలలను పనిలో పెట్టుకోరాదని, అలా ఎవరైనా చట్ట వ్యతిరేకంగా పిల్లలను పనిలో పెట్టుకున్నట్లయితే వారిపై చైల్డ్ లేబర్ యాక్ట్‌ప్రకారం శిక్షలు, జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఏపీను బాల కార్మిక రహిత రాష్ట్రంగా నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం, చీరాల లేబర్ ఆఫీసర్ రామకృష్ణ, సిఫార్సు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బడుగు కిషోర్, ఎం.నాగరాజు, షాడోస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రాజా సాల్మన్, ఐసీడీఎస్ పురుషోత్తం పాల్గొన్నారు.



పట్టణంలో బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

సేంద్రియ సాగుతో రైతుకు మేలు

గుంటూరు రూరల్: సేంద్రియ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టటం ద్వారా సేంద్రియ సాగు విజయవంతం అవుతుందని వ్యవసాయ శాఖ రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయం సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ గతంలో పెరుగుతున్న ప్రజల ఆహార అవసరాలను తీర్చే లక్ష్యంతో వ్యవసాయంలో రసాయనాలు ప్రవేశపెట్టటం జరిగిందన్నారు. రసాయనాలు వచ్చిన మొదట్లో రైతులు వీటిపై మక్కువ చూపేవారు కాదని, శాస్త్రవేత్తలు బలవంతంగా కొంతమంది రైతుల పొలాలలో ప్రయోగాత్మకంగా రసాయనాలను వినియోగించి పంటలు పండించగా వచ్చిన లాభాలతో తోటి రైతులు చిన్నగా రసాయన వ్యవసాయం వైపు మొగ్గుచూపారన్నారు. నేడు అది విచక్షణా రహితంగా వ్యవసాయంలో రసాయనాలు ఉపయోగించడంవల్ల నేల, నీరు, భూమి, ఆహారం కలుషితమై అనేక విపత్కర పరిస్థితులకు కారణమవుతున్నాయన్నారు. ఈ రసాయనిక వినియోగం ఇదే విధంగా కొనసాగితే ముందు ముందు పంట దిగుబడులు విపరీతంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని కావున రైతులు ముందుగా మేలుకుని సేంద్రియ బాట పట్టాలన్నారు. సేంద్రియ వ్యవసాయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించగలిగితే ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన ఎరువులు పురుగు మందుల తయారీ, దేశీయ ఆవుల పేడతో తయారు చేసే రసాయనాల తయారీ, మూత్రాలతో పాటు వేపాకు, సీతాఫలం ఆకు, కానుగ ఆకు, జిల్లేడు ఆకు, వావిలాకు, ఉమ్మెత్తాకు లాంటి వివిధ రకాల ఆకులతో పాటు వెల్లుల్లి, పచ్చిమిర్చి, పొగాకు పొడి లాంటి వాటిని కలిపి అనేక రకాల కషాయాలు ద్రావణాల తయారు చేసే విధానాలు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం కె.రాజకుమారి, సేంద్రియ రైతు శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, డాక్టర్ రామచంద్రం, డీపీఎం రాజకుమారి

వెంగళాయపాలెంలో కార్డన్ సెర్చ్

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. నల్లపాడు పోలీసులు తనిఖీలను చేపట్టారు. పది బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలి

వేమూరు: ఓట్ల లెక్కింపునకు ఉద్యోగులు నిబంధనలు పక్కాగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపుపై పోలింగ్ ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్లు మంగళవారం ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని కోరారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు బయటకు వెళ్లేందుకు అనుమతి లేదని వివరించారు. కౌంటింగ్‌కు మద్య తాగి వస్తే వారిపై చర్య లు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కౌంటింగ్ హాల్‌లో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు గొడవలు చేస్తే వారిపై రౌడీషీట్ నమో దు చేయడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్‌కు రా జకీయ పార్టీలు సహకారించాలని కోరారు. సమావేశంలో రేపల్లె డీఎస్పీ తుపాకుల మురళీ కృష్ణ, సీఐలు రామకృష్ణ, శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ వద్దు'

తెనాలి: ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ నిర్మాణం వద్దంటూ రూరల్ మండలం మల్లెపాడు గ్రామానికి చెందిన పలువురు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మల్లెపాడు ఎస్టీ కాలనీకి చెందిన ఒకరు సెల్ టవర్ నిర్మాణం ఏర్పాటుకు సంబంధిత కంపెనీతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతాయని, వెంటనే నిలిపివేయించాలని కోరుతూ గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కారుమంచి రవి కుమార్, ఎన్ శివ రామకృష్ణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు అరెస్ట్



తెనాలిరూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను తెనాలి ఎస్ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం వెల్లడించారు. పట్టణ మారిస్‌పేట స్వతంత్ర విహార్ హోటల్ సమీపంలో 96 మద్యం క్వార్టరు సీసాలను తరలిస్తూ ముగ్గురు యువకులు ఎస్ఈబీ అధికారులకు పరిమితికి మించి తీసుకెళుతుండడంతో వారిని ప్రశ్నించగా మద్యం దుకాణంలోని సేల్స్‌మ్యాన్ సహకరించినట్టు తెలిపారు. దీంతో నిందితులతో పాటు సేల్స్‌మ్యాన్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ వివరించారు.

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- దేవాలయం అభివృద్ధి పేరుతో నిబంధనలకు తూట్లు
- టీడీపీ నాయకుల మద్దతుతో మట్టి తరలింపు

కొల్లూరు: ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మండలంలోని చినపులివర్రు చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టారు. దేవాలయ అభివృద్ధి పేరుతో గురిందపల్లి చెరువులో పొక్లెయిన్ సాయంతో మట్టి తవ్వి ఆలయ ప్రాంతానికి తరలిస్తున్నారు. మామిళ్లమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధి తనయుడు పంచాయతీ పరిధిలోని చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టేపనికి స్థానికులను పురిగొల్పారు.



చినపులివర్రు సమీపంలో చెరువులో మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న పొక్లెయిన్

తవ్వకాలను నిలిపివేత

గురివిందపల్లి చెరువులో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి తవ్వకాలపై సమాచారం అందిన వెంటనే నిలిపివేయించాం. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పంచాయతీ తీర్మానం చేసి అధికారులు అనుమతించిన అనంతరం తవ్వకాలు చేపట్టుకోవాలని సూచించాం.

–దానయ్య, పంచాయతీ కార్యదర్శి, చినపులివర్రు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ప్రారంభ ర్యాలీ

తెనాలిరూరల్: పట్టణంలోని వివిధ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలను శనివారం నిర్వహించారు. మలేరియా రహిత సమాజం ఉండాలని ఉద్దేశ్యంతో ఏటా జూన్ మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా పరిగణించి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెనాలి పట్టణంలోని మలేరియా, ఫైలేరియా విభాగాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిపి అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఇన్చార్జి మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం ఉండాలన్న సంకల్పాన్ని నెరవేర్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వైద్యాధికారులు డాక్టర్ దివి కిషోర్ కుమార్, డాక్టర్ బీబీ జాన్, తెనాలి పట్టణ ఇంచార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వైద్యాధికారులు డాక్టర్ మోనిక కుమార్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ దేవికవాణి, డాక్టర్ మహిత, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ జి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు దాసరి మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల శివరామప్రసాద్, పుష్పలత, ఆరోగ్య కార్యకర్తలు రషీద్, నవీద్, రత్నాకర్, భాషిత్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, అంకమ్మ, జోస్పిన్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.